## క్లుప్తంగా

### 22న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 22న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు బస్టాండులో బయలుదేరుతుందన్నారు. సీట్లు కావాల్సిన ప్రయాణికులు ముందుగానే ఏడీఎం రేవతి 7382875034ను సంప్రదించాలని కోరారు.

### నేడు సర్వసభ్య సమావేశం

కలికిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామక్రిష్ణయ్య తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరవ్వాలని, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల ప్రత్యేక ఆహ్వానితులు హాజరవ్వాలని ఆయన కోరారు.

### విత్తన కాయల కోసం నమోదు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ప్రభుత్వం ద్వారా అందించే రాయితీ వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ ప్రేమలత సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అర ఎకరా పొలం ఉన్న రైతుకు ఒక బస్తా, ఎకరా లోపు ఉంటే రెండు బస్తాలు, రెండు ఎకరాలకుపైె ఎంత భూమి ఉన్నా మూడు బస్తాల కాయలు మాత్రమే అందజేస్తామన్నారు. 30 కిలోల వేరుశనగ కాయల బస్తా రూ.1,710లని ఏవో తెలిపారు. రైతులు ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం, సెల్‌ఫోన్ తీసుకుని ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు.

### మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె : మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలు గాయపడింది. ఈ సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. మోతీనగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయణ భార్య రెడ్డెమ్మ(75) వర్షపునీటిని శుభ్రం చేసేందుకు మిద్దెపైకి వెళ్లింది. తిరిగి కిందకు వస్తుండగా, ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరుషఫీ, స్థానికుల సహాయంతో ఆమెను హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### తాగునీటి సమస్య పరిష్కరించండి


పెద్దతిప్పసముద్రం: తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం మండలంలోని కందుకూరు తేరు బజారుకు చెందిన ప్రజలు ఖాళీ బిందెలతో సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా నీటి సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరి తదితరులు సచివాలయం వద్దకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ప్రత్యామ్నాయంగా చర్యలు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇవ్వడంతో వారంతా వెనుదిరిగారు.

### ఇంటర్ వర్సిటీ పోటీలకు సీఎన్ఆర్ విద్యార్థి


విష్ణువర్ధన్

పీలేరు : ఇంటర్ వర్సిటీ పోటీలకు సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి విష్ణువర్ధన్ ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ సి. విజయ భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న విష్ణువర్ధన్ బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో ఇటీవల జరిగిన యూనివర్సిటీ పరిధిలో పోటీల్లో ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈ నెల 31న చెన్నైలో జరిగే పోటీలకు ఎస్వీయూ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

### మిట్స్ ప్రొఫెసర్ కుసుమకు జ్యేష్ట ఎక్స్‌లెన్స్ అవార్డు



కురబలకోట: అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.కుసుమ జాతీయ స్థాయిలో జ్యేష్ఠ ఆచార్య భారత్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజాగ్‌లోని ఆంధ్ర యూనివర్సిటీలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెక్టార్‌లో ఆమె చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారు.

### జాతర ఏర్పాట్ల పరిశీలన

సంబేపల్లె : మండల పరిధిలో శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తిరునాల ఏర్పాట్లను సోమవారం సీఐ తులసీరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చాందినీబండ్ల ఊరేగింపు తదితర విషయాలపై ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచ్ రామచంద్రలతో చర్చించారు.

# భవితకు ప్రత్యేక సర్వే

- జిల్లాలో గడప గడపకు భవిత కేంద్రాల ఈఐఈఆర్పీలు
- జూన్ 9వతేదీ వరకు సర్వే
- ఇప్పటి వరకు 84 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు
- సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి



మదనపల్లెలోని భవిత కేంద్రం

మదనపల్లె సిటీ: దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. చదువు వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు,సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేతో ఇప్పటికే కొందరు బడుల్లో చేరేందుకు ముందుకు వచ్చారని చెబుతున్నారు.

**విస్తృతంగా ఇంటింటి సర్వే:**
సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులకు తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. వీటిపై అవగాహన లేక ఇప్పటికీ అనేక మంది తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వైకల్యంతో పుట్టిన తమ పిల్లల ఖర్మ ఇంతేనంటూ ఊరకుండిపోతున్నారు. దీని వల్ల ఆ పిల్లల్లో వైకల్యానికి తోడు విద్యాబుద్ధులు లోపించి ఇళ్లలోనే మగ్గిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటి సర్వేను సహిత విద్య అధికారులు విస్తృత ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇది ప్రారంభమైంది. ప్రస్తుత వేసవి సెలవుల సమయాన్ని దీని నిమిత్తం వినియోగిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించిన అందరినీ బడుల్లో చేర్చడానికి వీలుగా కార్యచరణను సిద్ధం చేశారు.

**చేరితే బహుళ ప్రయోజనాలు:**
ప్రత్యేక అవసరాల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల అధికారులు పేర్కొంటున్నారు. చదువుకునే దివ్యాంగులకు ఉచితంగా తగిన అన్ని ఉపకరణాలు మంజూరవుతున్నాయి. పాఠశాలలో చేరేవారికి ప్రతి నెలా రూ.300 చొప్పున రవాణా భత్యాన్ని చెల్లిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తారు. తొమ్మిది,పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు అందుతుంది. బాగా రాణించేవారికి ఉన్నత విద్య, ఉపాధికి అవకాశాలు ఉన్నాయి. వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువపత్రంతో ఫించను లభిస్తుంది. బస్సులు, రైలులో ప్రయాణానికి పాస్ సదుపాయం వర్తిస్తుంది. పాఠశాలకు రాలేని వారి ఇళ్లకే ఉపాధ్యాయులు వచ్చి అవసరమైన బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలలకు వచ్చినట్లే హాజరు నమోదవుతుంది.

- జిల్లాలోని భవిత కేంద్రాలు: 30
- ఇప్పటి వరకు గుర్తించిన పిల్లలు: 84
- సర్వే : జూన్ 9 వరకు


మదనపల్లెలో సర్వే చేస్తున్న ఐఈఆర్పీలు

**సద్వినియోగం చేసుకోవాలి**



ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకుడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలన్ని సద్వినియోగం చేసుకోవాలి. జూన్ నెల 9 వరకు భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులతో ఇంటింటి సర్వే కొనసాగుతుంది. మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్ల వారిని పాఠశాలల్లో చేర్పించనున్నాం.
–శివప్రకాష్‌రెడ్డి, డీఈఓ, అన్నమయ్య జిల్లా

**ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నాం**



జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్పీలు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు 84 మందిని గుర్తించాం. ఇటీవల నిర్వహించిన క్యాంపులలో బడి ఈడు పిల్లలు కూడా ఉన్నారు. వారంతా బడికి వచ్చే అవకాశాలున్నా రావడం లేదు. అటువంటి వారిని చైతన్య పరిచి భవిత కేంద్రాలకు రప్పించి అక్కడ విద్యాబుద్ధులు నేర్పించడమే ప్రభుత్వ లక్ష్యం.
–జనార్దన్, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్

## శేష వాహనంపై వెంకటేశ్వరుడు


పెద్ద శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటేశ్వరుడు పెద్ద శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. స్థానిక నెహ్రూనగర్‌కు చెందినవారు ఉభయదారులుగా వ్యవహరించారు. బండమీదకమ్మపల్లెకు చెందిన ఉభయదారులు హంసవాహనంపై స్వామిని ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బింగి పాండు, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా


పెద్దమండ్యం నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

–ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులకు ఎప్పటికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో పెద్దమండ్యం నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. నియోజవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో నాయకులు రెడ్డప్పరెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లికార్జున, నరసింహులు, సత్యనారాయణరెడ్డి, రామమోహన్, శ్రీనివాసులురెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రోడ్డుపై మురుగునీటిని తొలగించండి


ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మదనపల్లె : పట్టణంలోని ఆర్టీసీబస్టాండు సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగునీటిని అరికట్టి పాదచారులు, ద్విచక్రవాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరారు. సోమవారం ఆర్టీసీబస్టాండు ఎదురుగా రోజాహోటల్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని కొందరు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో, వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్‌చేశారు. సుమారు పదిరోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. పాదచారులు మురుగునీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మామూలు రోజుల్లోనే పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే... వర్షాకాలంలో వర్షాలు పడితే రోడ్లు చెరువులయ్యే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు తక్షణమే ఈ విషయమై చర్యలు తీసుకుని, కాలువల్లో పూడికలు తీయించి శుభ్రపరచాలన్నారు. మురికినీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వైభవంగా సత్యమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో సత్యమ్మ

కలికిరి: పట్టణ పరిధిలో రామ్‌నగర్ కాలనిలో వెలసిన శ్రీసత్యమ్మ తల్లి జాతర వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణ చేసి వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం భక్తులు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు నాగకుమార్‌రెడ్డి, బాబు, సుధాకర, మురళి, వెంటరమణ, లీలా కుమార్, శ్రీనాథ్ తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

### ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెద్దమండ్యం: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్‌ఐ చెన్నకేశవ అన్నారు. మండలంలోని కలిచెర్ల, తురకపల్లె, చెరువుకింద పల్లె గ్రామాలలో ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకొన్నారన్నారు. అయితే జూన్ 4న కౌంటింగ్ నేపథ్యంలో బెట్టింగ్‌లకు పాల్పడినా, గ్రామాలలో ఘర్షణలకు దిగినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడా డీజేలు ఏర్పాటు చేసుకొనేందుకు వీలు లేదన్నారు. ఎన్నికల కోడ్ అమలులోనే ఉందని గుర్తు చేశారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేసేవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పిజెఖాన్, క్రిష్ణమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

### ద్విచక్రవాహన ప్రమాదంలో మహిళకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. కురబలకోటకు చెందిన రమణ భార్య భాగ్యమ్మ(30) కూలిపనులకై మద్దిరెడ్డిపల్లెకు వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి ఆమె జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

### కరుణించవా.. కాలభైరవా


: ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి తిరునాల అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులు ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న మంగళవారం స్వామి వారిని వెలుగల్లు వద్ద ఉన్న గండిమడుగులో అభిషకాలతో తిరునాల హహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఇక రెండవ రోజు 22వ తేదీ బుధవారం ఉదయం గణపతి పూజ, గోపూజ, కాలభైరవుడికి అభిషేకాలు, కలశారాధనలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం స్వామి వారికి రుద్రహోమం, అభిషేకాలు, మహామంగళహారతులు నిర్వహిస్తారు. 23వ తేది గురువారం ఉదయం నుంచి స్వామి వారికి గణపతి పూజ నిర్వహించిన తరువాత శ్రీ కాలభైరవుడికి ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు రాత్రి అంగరంగవైభవంగా విద్యుత్‌దీపాల మధ్య చాందినీబండ్లు మెరవణితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 24న శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారి మైలు తిరునాల, అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ తిరునాల మహోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ పాలక మండలి సభ్యులు కోరారు.

## హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

**డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ**

నిమ్మనపల్లె : వైద్య పరీక్షల ద్వారా హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని మదనపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ అన్నారు. సోమవారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి లో నిర్వహించిన 104 వాహన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అనంతరం నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రికార్డులను, రోగుల ఓపి పరిశీలించారు. డాక్టర్ ప్రత్యుష ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో 104 వాహన ద్వారా వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. 12 వారాల లోపు హై రిస్క్ గర్భిణులను గుర్తించి, వైద్యుల సూచనలు పాటించేలా, సరైన పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు.104 వాహన వైద్య సేవల ద్వారా వృద్ధులకు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులకు బీపీ, షుగర్ వంటి ప్రాథమిక వైద్య పరీక్షలను నిర్వహించి, తగిన చికిత్సలతో పాటు మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎం ఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎం చెన్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాతల ఖాతాల్లో రూ.4.98 కోట్ల నిధులు

పెద్దతిప్పసముద్రం: సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ కావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితి) గత రెండు రోజుల నుంచి జమ అవుతున్నాయి. ఎన్నికలకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధుల విడుదలకు బటన్ నొక్కినా కూటమి నేతల పుణ్యమా అని ఎన్నికల కోడ్ ఉల్లంఘనా అంటూ ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల పోలింగ్ ముగియడంతో సదరు నిధులు రైతుల ఖాతాలకు జమ అవుతున్నాయి. మండలంలోని 5,075 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు రూ.4.98 కోట్లు మంజూరైనట్లు వ్యవసాయ శాఖ అధికారి ప్రేమలత సోమవారం పేర్కొన్నారు.

## వేరుశనగ విత్తన కాయల పంపిణీకి సిద్ధం

నిమ్మనపల్లె : మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేసేందుకు 1600 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను సిద్ధం చేశామని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...

కె -6 రకం( తెల్ల కాయలు )500 క్వింటాళ్లు, నారాయణి రకం ( ఎర్ర కాయలు )1100 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం 40% రాయితీతో రైతులకు అందజేస్తాందన్నారు. వేరుశనగ పంట సాగు చేసే రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను విత్తన కాయల కోసం నమోదు చేసుకోవాలని కోరారు. 40 శాతం రాయితీ పోను, ఒక బస్తా కే-6 రకం రూ.1710 కాగా, నారాయణ రకం రూ.1746 చొప్పున రైతులు నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## మల్లన్నా..క్షేమంగా చూడు స్వామి


అంగళ్లు మల్లయ్య కొండపై ప్రత్యేక పూజలు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండపై సోమవారం వివిధ ప్రాంతాల భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతి సోమవారం ఇక్కడ పెద్ద ఎత్తున సాంప్రదాయ మంగళ వాయిద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దకటవకు చెందిన దేరంగుల రాము, డి. రత్నమ్మ, రూప, అక్షయ, రెడ్డిప్రతాప్, పోరెడ్డి ఎల్లారెడ్డి, రేణుక తదితరులను సన్మానించారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారణలో అమ్మవారు

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట సమీపంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి తిరునాలను రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏరాట్లు చేశారు.

## మల్లయ్యకొండపై భక్తుల సందడి


ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభమరాంబిక మల్లికార్జునస్వామిని భక్తులు సోమవారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. పలువురు భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లె వన్ డిపో నుంచి మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడిపారు.

## చింత చిగురు కోతకొచ్చిందో...!


అమ్మకానికి చింతచిగురు

- కొనుగోలుకు ప్రజల ఆసక్తి
- కిలో రూ. 400 ధర

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్‌లో చింతచెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆకురాలిన చింత చెట్లు ప్రస్తుతం చిగురించాయి. ఈ సీజన్ వస్తే ఈ ప్రాంతంలో పలువురు ఇళ్లలో చింతచిగురును ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో లేత చిరుగు కోసం చింత చెట్ల వద్ద జనం కనిపిస్తున్నారు. చింతచెట్లకు ఎటువంటి క్రిమిసంహారకమందులు లాంటివి వాడరు. దానికి తోడు చింత చిగురులో సీ విటమిన్ పుష్కలంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పూర్వీకుల కాలం నుంచి ఈ ప్రాంతాల్లో చింత చిగురుకు భలే క్రేజ్ ఉంది. చిగురుతో లేత వంకాయలేసి చారు కాచి దానిని రాగి సంగటితో వడస్తే అబ్బో ఊహిస్తేనే నోట్లో నీళ్లరుతాయి. కొందరు చింతచిగురు ఎండపెట్టి పౌడర్‌గా తయారు చేసుకుని వేపుళ్లల్లో వాడుతారు. చింత చిగురు సీజన్ ఇక నెల రోజులు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత చెట్లలోని చిగురు ముదిరిపోతుంది. అందుదకే ఈ సీజన్‌లో దొరికే చిగురు కోసం ఈ ప్రాంత వాసులు అంత ఆసక్తి చూపుతారు.

**కాసులు కురిపిస్తున్న చింతచిగురు**
చింతే కదా అని తీసిపారేయకండి. మదనపల్లె మార్కెట్‌లో కిలో ధర ఏకంగా రూ.400 పలుకుతోంది. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో చెట్ల నుంచి చిగురును సేకరించి మదనపల్లె మున్సిపల్ కార్యాలయం, బెంగుళూరు బస్టాండు, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో చింతచిగురు అమ్ముతున్నారు. దీని మంచి డిమాండ్ ఉండటంతో పలువురు కొనుగోలు చేస్తున్నారు.

### శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారి మూల విరాట్‌కు అందంగా అలంకరించారు.